క్లుప్తంగా

రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ: వాహనదారులకు సంబంధించిన పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై ప్రభుత్వం ప్రకటించిన రాయితీని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం ఎస్ఐ రవి ప్రకటనలో కోరారు. ద్విచక్రవాహనాలపై 80 శాతం, కార్లు, ఇతర వాహనాలకు 60 శాతం రాయితీని ప్రకటించిందని పేర్కొన్నారు.

అయోధ్య అక్షతల పంపిణీ



తెలకపల్లి: మండల కేంద్రంలో అయోధ్య రాముడి అక్షతలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర సమితి జిల్లా సంయోజకులు శివయ్య గౌడ్ మాట్లాడుతూ పవిత్ర అయోధ్య రాముడి అక్షతలను అన్ని గ్రామాలకు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరు అయోధ్య ఆలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర మండల సమితి సభ్యులు రామకృష్ణ, శివకృష్ణ, శివకేశవులు, రాజేష్‌తో పాటు వివిధ గ్రామల నుంచి భక్తులు విశ్వహిందు పరిషత్ ఆధ్యాత్మిక భజనపరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు నిబంధనలు పెట్టొద్దు

వెల్దండ: రైతుబంధుకు నిబంధనలు పెట్టొద్దని మాజీ ఎంపీటీసీ కడారి కృష్ణయ్యయాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ఐదు ఎకరాల ఉన్న రైతులకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలని నిబంధనపై ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలని కోరారు. యాసంగిలో రైతులు పంటల సాగు మొదలు పెట్టిన నేటికి ప్రభుత్వం రైతుబంధు డబ్బులు ఇవ్వలేదన్నారు. రైతులు రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. పంట రుణమాఫీ రూ.2 లక్షలు వెంటనే చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌నాయక్, నాగయ్యగౌడు తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



వెల్దండ: మండల కేంద్రంలో మంగళవారం అయ్యప్పస్వాములు పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు, తదితరులు ఉన్నారు.

ఘనంగా బాక్సింగ్ డే

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎంబీ చర్చి ఆవరణలో మంగళవారం క్రైస్తవులు బాక్సింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు క్రికెట్ పోటీలు, చిన్నారులకు, మహిళలకు ఆటపాటల పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన సనీత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంబీ ఫీల్డ్ చైర్మన్ రెవరెండ్ పురుషోత్తం, చర్చ్ చైర్మన్ జోసఫ్, వైస్ చైర్మన్ సంపత్ కుమార్, సెక్రెటరీ సంపత్ కుమార్, బీఎస్ ఏలియా, బెంజమిన్ ,దయానంద్, విజయ్ కుమార్, భాస్కర్, హనీ, శ్రీఖర్ బాబు, ప్రదీప్ కుమార్, కరుణాకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు స్వాధీనం

నాగర్‌కర్నూల్ క్రైం: చోరీకి పాల్పడి ఆటోలో తరలిస్తున్న విద్యుత్ తీగలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ వైర్లు చోరీ చేసి ఆటోలో జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి శ్రీపురం రోడ్డులో ఆటోను వదిలేసి పరారయ్యారు. ఆటో విద్యుత్ వైర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై మహేందర్ తెలిపారు.

28 నుంచి గ్రామసభలు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రత్యేక గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి 32 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓల ఆధ్వర్యంలో గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామసభల్లో రేషన్‌కార్డులు, మహాలక్ష్మి పథకానికి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు అందుబాటులో లేకున్న జనవరి 6వ తేది వరకు దరఖాస్తులను గ్రామ కార్యదర్శులకు అందించడానికి అవకాశం ఉందని వివరించారు.

జీవనాధారం కరువు

- ఆదివాసి చెంచుల జీవితాలు దుర్భరం
- ఉపాధి కోల్పోతున్న వైనం



రాంపూర్ పెంటలో చెంచుల నివాసం బొడ్డు గుడిసె



అడవి నుంచి చీపురు పుల్లలు సేకరించి తీసుకెళ్తున్న పుల్లాయిపల్లి చెంచులు

మన్ననూర్: అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆధారపడి జీవనం చేసే ఆదివాసి చెంచుల జీవితాలు దుర్భరంగా మారాయి. జీవనాధారంగా ఉండే అటవీ ఫలసాయం మొక్కలు లేక జీవనోపాధి కోల్పోయారు. ప్రభుత్వం గుర్తించి ఉపాధి హామీ పథంలో చేర్చి ఆ మొక్కలను అడవుల్లో నాటించాలని ఆదివాసి చెంచులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో నల్లమల అభయారణ్యంలో మొర్లీ, చింత, కానుగు, ఇసముష్టి, గోగు, తవుసి, సిల్ల, ఉసిరి, మాడుపు, కుంకుడు కాయలు తదితర వృక్షాలు విస్తారంగా ఉండేవి. చెంచులతో పాటూ అటవీ సమీప గ్రామాల ప్రజలు కూడా వీటిని సేకరించి విక్రయించగా వచ్చే ఆదాయంతో జీవనం చేసేవారు. అటవీ ఉత్పత్తులను సేకరించిన చెంచులు గిరిజన సేవా సంస్థలో (జీసీసీ) విక్రయించి నిత్యవసరాలు కొనుగోలు చేసుకునే వారు.

కనిపించని ఫలసాయం మొక్కలు

నల్లమల అటవీ ప్రాంతంలో చెంచులకు జీవనాధారమైన అటవీ ఫలసాయం మొక్కలు ప్రస్తుతం కనుచూపు మేరలో ఎక్కడ కనిపించకపోగా ఆ వృక్షాలు పూర్తిగా అంతరించి పోయాయి. మల్లాపూర్, పుల్లాయిపల్లి, రాంపూర్, అప్పాపూర్, భౌరాపూర్, మేడిమల్కల, ఈర్లపెంట, సంఘిడిగుండాలు, పందిబోర్రె, సార్లపల్లి, కుడిచింతలబైలు తదితర అటవీ సరిహద్దు గ్రామాలు, పెంటలలోని చెంచులకు అటవీ ప్రాంతంలో ఎక్కడ కూడా అటవీ ఉత్పత్తులు దొరక్క దిక్కుతోచని స్థితిలో నిశ్చాయ పరిస్థితుల్లో ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పథకం పనులు, సబ్సిడీ బియ్యంపై ఆధారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. అదేవిధంగా అడవుల్లో అంతరించి పోయిన ఫల సాయం వృక్షాల స్థానంలో అక్కడక్కడ ప్లాంటేషన్లు ఏర్పాటు చేసి ఆదిమ జాతి చెంచులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దశాబ్దాల కాలంగా వీటినే నమ్ముకుని జీవిస్తున్న చెంచులు కారణాలు ఏవైనా ఫలసాయం జాతి వృక్షజాలం అడవుల్లో నశించిపోతుండటంతో దుర్భరమైన జీవితాలను గడుపుతూ కాలం వెల్లదీస్తున్నామని ఆదివాసి చెంచులు వాపోతున్నారు.

మొక్కలు పంపిణీ చేయాలి



అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నాం. ప్రభుత్వం ఫలసాయం మొక్కలు పంపిణీ చేయాలి. ఉపాధి పథకం ద్వారా అటవీ పరిసర ప్రాంతంలో నాటించాలి. నాలుగు ఐదు ఏళ్లలో అటవీ ఉత్పత్తులు వస్తాయి. దీంతో జీవనోపాధి దొరుకుతుంది.

–తోకల గురువయ్య, అప్పాపూర్

ఉపాధి పనికి వెళ్తున్నాం



అడవుల్లో చెట్లు ఎండి పోయాయి. ఉపాధి పనులతోనే ఇప్పుడు బతుకుతున్నం. కాబట్టి ఒక్కొక్క పెంటకు కొన్ని చొప్పున ఫలసాయం మొక్కలు అడవుల్లో నాటాలి. వాటిని కాపాడుకుని కుటుంబాలను పోషించుకుంటాం.

–నల్లపోతుల లింగయ్య, రాంపూర్ పెంట

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

అడవులలో చెంచుల అభివృద్ధి కోసం ఫలసాయం మొక్కలు నాటాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు సానుకూలంగా స్పందించారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. చెంచుల జీవనోపాధికి అన్ని విధాల సహాయ సహకారం అందిస్తాం. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం.

–సంతోష్‌కుమార్, జీసీసీ బ్రాంచ్ మేనేజర్

సంప్రదాయాలను కాపాడుకుందాం

అచ్చంపేట రూరల్: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మద్దిమడుగు ఉత్సవాల్లో భాగంగా పలువురు కళాకారులు 'రామాంజనేయ యుద్ధ సీను' 'సత్యహరిశ్చంద్ర పూర్తినాటకం' 'శ్రీకృష్ణరాయబారం అలకసీను' నాటకాలను ప్రదర్శించారు. నాటకాలను ఎమ్మెల్యే తిలకించి 'పాంచాలి... పంచ భర్తృక అంటూ... దుర్యోధనుడి ఓ నాటక డైలాగ్‌ను చెప్పి చూపరులను ఆకట్టుకున్నారు. విల్లు చేతబూని రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు సంధించారు.



బాణం ఎక్కి పెడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

కనులపండువగా శ్రీవారి కల్యాణం



స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురం సమీపంలో ఉన్న గుట్టపై వెలసిన అలివేలుమంగ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. 17వ వార్షికోత్సవం సందర్భంగా 24వ నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామి వారికి వేద పండితులు వేద మంత్రోచ్చరణ మధ్య కల్యాణ తంతు కొనసాగింది. అంతకు ముందు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను సమీపంలో ఉన్న పుష్కరిణిలో స్నానం చేయించి మండపంపై ఏర్పాటు చేశారు. ప్రాత కాలపూజలు, అభిషేకాలు, దీక్షా హోమం, పూర్ణాహుతి చేశారు. కల్యాణం అనంతరం మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం, వసతులు కల్పించారు. కొల్లాపూర్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ శ్రీనివాసులు తోపాటు వివిధ పార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. సర్పంచ్ భారతి స్వామి వారికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకొని భక్తులు తన్మయత్వం పొందారు. ఆలయ ఆవణలో తినుబండారాల షాపులు ప్రజలతో కిక్కిరిశాయి. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో దత్తాత్రేయ స్వామి, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. దత్త జయంతి, మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో దత్తాత్రేయ స్వామి వారికి వివిధ సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, దత్తాత్రేయ హోమాన్ని, సామూహిక వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలను చేశారు. అనంతరం విష్ణు సహస్ర పారాయణ కమిటీ, భజన మండలి సభ్యులతో ప్రత్యేకంగా భజన పోటీలు ఏర్పాటు చేశారు. ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్, వేద పండితులు కొరవి శ్రీనివాసచార్యులు, అర్థం రవీందర్, టి.మల్లేష్, శివ, నందకిషోర్, మన్నెపు రెడ్డి, గిరి, రమాదేవి, శారద, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సిర్సవాడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

తాడూరు: మండలంలోని సిర్సవాడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ ఆవరణలో మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా మంగళవారం సామూహిక వ్రతాలు నిర్వహించారు. అభిషేకం, అర్చనలు చేశారు. పూజారి జగదీశ్వరాచారి తెలిపారు.

దుప్పట్ల పంపిణీ



వంగూరు: మండలంలోని ఉల్పర గ్రామానికి చెందిన పసుల కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు శ్యాంసుందర్‌రెడ్డి, హనుమంతరెడ్డిలు మంగళవారం గ్రామస్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సేవదృక్పథం అలవర్చుకోవాలని కోరారు.

గౌడ సంఘం అభివృద్ధికి కృషి



కల్వకుర్తిరూరల్: నియోజకవర్గంలోని గౌడ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజీ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఆర్ఎం జూనియర్ కళాశాలలో నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాజీ గౌడ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధితో పాటు ప్రతి గౌడ కుటుంబం అభివృద్ధి చెందేలా అండగా ఉంటామన్నారు. సంఘం ప్రధానకార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, యువజన సంఘం అధ్యక్షుడు రుకుల్ గౌడ్, ముఖ్య సలహాదారుడు బాలస్వామి గౌడ్, వెంకట్ గౌడ్, విజయ్‌గౌడ్, దామోదర్ గౌడ్, రవిగౌడ్, నరేష్‌గౌడ్, జంగయ్య గౌడ్ తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

వృద్ధులకు వాకింగ్ స్టాండ్ల అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రలో 20 మంది వృద్ధులకు రూ.30 వేల విలు వ చేసే వాకింగ్ స్టాండ్‌లను మంగళవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వృద్ధులు, దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని కోరారు. కార్యక్రమంలో అశోక్, హరీష్, సందీప్, నందు యాదవ్, చంద్రయ్య పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవాలి



కోడేరు: ప్రతిఒక్కరూ కళ్లను కాపాడుకోవాలని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సూపర్‌వైజర్ వెంకటయ్య, కోఆర్డినేటర్ రాజు అన్నారు. మండల కేంద్రంలో కంటి వైద్య ఆస్పత్రి రెండో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వారు కేక్ కట్ చేసి మాట్లాడారు. రెండేళ్ల నుంచి 4923 మందికి కంటి పరీక్షలు చేయగా 1026 మందికి అద్దాలు పంపిణీ చేశామన్నారు. 993మందికి కంటి ఆపరేషన్ల కోసం రెఫర్ చేశామన్నారు. రంగినేని కమలమ్మ, రఘుపతిరావు కుమారులు కోడేరులోని ఎల్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టెక్నిషియన్ విజయ్‌కుమార్, మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, శాంతయ్య, ఏఎస్ఐ రవి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి, సోమనాథ్, వెంకటస్వామి, మాజీ వార్డు సభ్యులు రాజు, నాగేషి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి



అచ్చంపేట రూరల్: ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చందు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న వసతిగృహాలు శిథిలావస్థకు చేరాయని, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. నూతన భవనాలను మంజూరు చేయాలని కోరారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచి పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శాంతన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని మంగళవారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్నతో పాటు సీపీఐ మండల నాయకులు బంగారయ్య, ఉప్పల పాండు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 3 లక్షల దళిత కుటుంబాలకు మూడెకరాల భూమిని పంచుతామని తొలి సంతకం చేసి 2శాతం కూడా భూపంపిణీ చేయలేదని వివరించారు. అనర్హులకు దళితబంధు ఇచ్చారని పేర్కొన్నారు. 2016 నుంచి ఎస్సీ కార్పొరేషన్ రుణాల సబ్సిడీలు పెండింగ్‌లో పెట్టిందని తక్షణమే వాటిని విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యక్షుడు అనుముల సత్యనారాయణ, సభ్యులు ఉప్పల పాండు, బక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి పట్టణంలో అక్షరవనం ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ పోటీల్లో పెద్దకొత్తపల్లి జట్టు మొదటి బహుమతి గెలుచుకున్నట్లు క్రీడాకారుడు రఘుపతి రెడ్డి తెలిపారు. ఈ పోటీలలో 70 జట్లు పాల్గొన్నాయి. మొదటి బహుమతి పెద్దకొత్తపల్లి జట్టు, రెండో బహుమతి, మూడో బహుమతి మహబూబ్‌నగర్ జట్టు గెలుపొందాయి. కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి విజేతలకు నగదు బహుమతులతో పాటు మెమెంటోలను అందజేశారు. స్థానిక సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ శశికళ శివశంకర్, మాజీ ఎంపీటీసీ దండు నర్సింహులు క్రీడాకారులను అభినందించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

వీపనగండ్ల: మామిడి తోటలు పెంచే రైతులు ముందస్తు సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల అధిక దిగుబడిని పొందవచ్చని ఎస్వీకే శాస్త్రవేత్త కె సురేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మన గ్రోమోర్, పెబ్బేరు వారు ఏర్పాటు చేసిన మామిడి రైతుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మామిడిలో నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. చీడపీడల నివారణ కోసం సామూహిక చర్యలను తీసుకోవాలని సూచించారు. మామిడి తోటలకు అధిక నష్టాన్ని కలిగించే తేనెమంచు, నల్లతామర పురుగులు, పూత దశలో ఆశించే బూడిద తెగులు నివారణ కోసం ఎక్సోకోనాజోల్ మందును వాడాలన్నారు. అధిక రసాయన ఎరువులు వాడడం వల్ల తోటలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ మార్కెటింగ్ మేనేజర్ కిషోర్, ఏరియా మేనేజర్ నరేష్, మన గ్రోమోర్ స్టోర్ మేనేజర్ సుబ్బారాయుడు, సర్పంచ్ నర్సింహారెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.



మామిడి తోటల సాగుపై రైతులకు సూచనలిస్తున్న ఎస్వీకే శాస్త్రవేత్త సురేష్

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న ఆనంద్‌జీ

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్ ఆనంద్‌జీ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీపీఐ దేశానికి ప్రత్యామ్నాయం అని అన్నారు. మండల పార్టీ కార్యదర్శి మర్యాద వెంకటయ్య, మారేడు శివశంకర్, కపిలవాయి గోపిచారి, రామస్వామి, కొత్రశేఖర్, పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు సీపీఐ జెండా ఎగురవేసి మాట్లాడారు. నర్సింహా, లక్ష్మణ స్వామి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రలోని నెహ్రూ చౌరస్తాలో సీపీఐ అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేశవులు గౌడ్ సీపీఐ జెండా ఎగురవేసి మాట్లాడారు. శంకర్ గౌడ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు, సీపీఐ మండల కార్యదర్శి వేణిపల్లి రవీందర్, బాల మురళీ, విష్ణు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, చంద్రయ్యగౌడ్, కుర్మయ్య, చెన్నయ్య, రామకృష్ణ, తిరుపతయ్య పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్ఎండీ ఫయాజ్ కట్ చేశారు. ఆర్ ఇందిర, నాయకులు తుమ్మల శివుడు, యూసూఫ్, కురుమయ్య, డి.వెంకటస్వామి, దయానంద్ తదితరులున్నారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కృష్ణాజీ, మంగంపేట శ్రీనివాసులు, శ్రీను, బుగ్గ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరుశరాములు పార్టీ జెండాను ఆవిష్కరించారు. శ్రీనివాసులు, రవీందర్, వీరేశం, శివ, పాల్గొన్నారు.

సీఎం సోదరుడికి ఘన స్వాగతం

మన్ననూర్: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి నల్లమల ప్రజలు మంగళవారం ఘన స్వాగతం పలికారు. మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వెళ్తున్న ఆయనకు నల్లమల ముఖద్వారం వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి బాణాసంచా కాల్చారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రేణయ్య, సత్యనారాయణ, పాండు, అంబనారాయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వంగూరు: మద్దిమడుగు ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి కొండారెడ్డిపల్లి, శ్రీశైలం క్రాస్‌రోడ్, వంగూరు స్టేజ్, తిరుమలగిరి గ్రామాల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి సన్మానించారు. నాయకులు పాండురంగారెడ్డి, హరీష్‌రెడ్డి, నారాయణరెడ్డి, క్యామమల్లయ్య, పరుశురాములు, వేమారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.